నీలాపనింద

శ్రీమతి కామేశ్వరమ్మ, బి. ఏ.

౧

మాలతీమోహనులవివాహమై అప్పటికి ఆరునెలలు కావచ్చినది. వారిరువురు అతిఅన్యోన్యానురాగముతో నుండిరి. మోహనుడు బి.ఏ.,బి.ఎల్. ప్యాసై బరంపురమునందు న్యాయవాదిగా వుండెను. అత్యవసరమగు నొకకేసుమీద మద్రాసువెళ్లి అప్పటికి వారము దినములైనది. మాలతి దినమొకయుగముగా గడుపుచు ప్రతిపోష్టుకు ఎదురుచూచుచుండె. ఆనాడు రాత్రి మెయిల్లో వచ్చుచున్నానని మోహనుడు తంతిపంపె. మాలతి నిమిషములు లెక్కపెడుచూ గడియారము వంకనె చూచుచు రాత్రియగువఱకు కాలమెట్లో త్రోసిపుచ్చి మెయిలువేళకు తాను, ఇంట వంటఏర్పాటులుచేసి రైలుకు పోయినది. సిగ్నల్ ఇచ్చిరి. మాలతికి గుండె తటతట కొట్టుకొనసాగె. ఆత్రమెచ్చెను. ఇంతలో రైలు దుముకుచు ప్లాటుఫారంమీదకు వచ్చి నిలచెను. వెతుకుకొనకుండగనే మోహనుడు ఆమె కెదురుగ నిలచినపెట్టెలోనె తలుపుతెఱచుకు నిలబడి, రైలు ఆగినతక్షణం వురికి భార్యబుజము తట్టినాడు. ఇద్దరకూ అపరిమితానందము కల్గి, సామానులు తీసుకుని కారెక్కి ఇల్లుచేరిరి.

భోజనము సల్పినపిమ్మట ఇద్దరు డ్రాయింగుహాలులో కూర్చొనిరి.

మోహనుడు:— మాలతీ, నీవెట్లుంటివో కాని నాకుమాత్రము ఆదరిద్రపు చెన్నపట్నంలో నిన్ను వదలివుండుట యమలోకమువలె వున్నది. రాత్రిఅయితే నిద్ర రాదు. కోర్టులో వున్నంతసేపూ ఏమో, హోటలుకువస్తే నీమీదే ధ్యాన్నం. మనమిద్దరమూ పోయిన ఎంత చక్కగా కాలము గడపెడివాళ్లమోను. ఇన్నాళ్లు వుండవలసివచ్చునని మొదట నే ననుకొనలేదు.

మాలతి:—అంతా దొంగమాటలే. మద్రాసులో సినీమాలులేవా, బీచ్ లేదా, స్నేహితులులేరా? రోజూ ముందులాగు క్వీన్‌మేరీకాలేజీబీచికి పొయ్యేవారా?

మోహను:—చెబితే నమ్మవు. ఒక్కసారైనా ఆపక్కపోలేదు. ఏమి చూడను ఇష్టము లేకపోయినది. ఇంకమీద వంటరిగా పోగూడదు. మనమిద్దరము పోవలెను. అయితే మీవాళ్లూ మానాన్నా అంతా క్షేమమా? నీవెందు కింతచిక్కివున్నావు?

మాలతి:—మీకంటేనా? పరదేశమెళ్లి హోటలుతిండి తిని మీరు చిక్కివున్నారుగాని నాకేమీ, లెండి, ప్రొద్దుపోయింది నిద్రవస్తోన్నట్లున్నది.

౨

నరసింహారావుగారు ఆవూరిలో చాల సంవత్సరములు లాయరుగావుండి బాగా

ఆస్తిసంపాదించి కొడుకు పట్టాపుచ్చుకొన్న దగ్గఱనుంచీ ఇంట్లోనే స్వంతవ్యవహారాలు, వడ్డీలు, సడ్డీలు చూసుకుంటూవున్నాడు. సింగరాజు లింగరాజులాగు మహాపిసినారి. నాలిక పీక్కున్నా దానం ధర్మం లేదు. అతి కోపిష్టి. స్వలాభి ఆయనకు భార్య చాల కాలంక్రిందటనే కాలంచేసింది. అయితే ఒక కొడుకూ, కూతురూ వుండుటచే తిరిగి వివాహం చేసుకోలేదు. మోహానుడు పెద్దవాడు. కూతురు లీల. ఆమె కొంతవఱకు చదివి, తన ఉపాధ్యాయుని వలచి ఆయనను పెండ్లిచేసుకోదలచినపుడు, తండ్రి వేరుకులమని కూతురికి పెండ్లికి అనుజ్ఞ ఇవ్వక చాలా తిప్పలుపెట్టెను. కాని జ్ఞానము తెలిసిన బిడ్డ ధైర్యశాలి అగుటచే తండ్రి మూర్ఖత్వము గ్రహించి, స్వతంత్రించి తానుకోరిన ఆయననే పెండ్లి చేసుకొనెను. అప్పటినుండియు తండ్రికి కూతురుకు కంటచూపుగాని నోట మాటగాని లేదు. తరువాత మోహానుని వివాహమునకు మాత్రము అంతఎక్కువ ఆటంకపెట్టలేదు.

"అయితే మీవాళ్లూ......నీవెందు కింత చిక్కివున్నావు?"

మరునాడు ఉదయము మోహానుడు కాఫీ తాగి తండ్రినిచూచుటకు వెళ్లెను. ఇద్దరూ చాలాసేపుమాట్లాడుకొనిరి. కొంతతడవైన వెనుకమోహానుని ముఖవైఖరి మారి కలత చెందినట్లుండె. వెంటనే తిరిగి ఇంటికివచ్చె.

మాలతి కారుచప్పడు విని ఎప్పటిఅట్ల ఎదురగా రాగా, మోహను డామెవంకకూడ చూడక చివాలున తనగదిలోనికి పోయెను. మాలతికి భయము ఆశ్చర్యము కలిగి మెల్లిగా భర్తవద్దకు పోయి, ఎందులకట్లుండెనని అడిగె.

మో:—నీవు నాదగ్గఱ ఆటలాడుచున్నావా? నీవు నే నూరలేనపుడు చేసిన దొంగపని బయల్పడినది. ఇంతతుంటరివని ఎన్నడును అనుకొనలేదు. చదువుకొన్నవాళ్లకిల్లాంటిబుద్ధివుంద నని వూరికే నానా ప్రజలు చెప్పకొనేది. నేటితో మనస్నేహము సరి. నీవిక మీతలితండ్రులవద్దకు పొమ్ము.'

అని చివాలున లేచి మాట్లాడ ప్రయత్నించిన భార్యను విదిలించికొట్టి మోటారు తెమ్మని ఆజ్ఞాపించె. మాలతి నిశ్చేష్టయై అట్లే స్పృహతప్పి పడిపోయెను. ఆమె నట్లే కారులో వేసి అచటికి ౧౦ మైళ్లలో వున్న ఆమెపితృగృహమునకు తీసుకుపొమ్మని డ్రైవరుకు చెప్పి కారు పంపివేసెను. మాలతిప్రేమయే లేనపుడు తనకు జీవిత మెందులకు. ఇంక సుఖమెక్కడిదని తానును నౌకరులను పంపివేసి ఇల్లు తాళమువేసి, కాశీకి లేచి పోయెను.

3

మాలతి మధుసూధనరావు, అచ్చమాంబగార్ల ఏకపుత్రి. లేకలేక కలిగినబిడ్డను అతిగారాబముతో పెంచి మంచివిద్యాబుద్ధులు గఱపిరి. చిన్నతనముననే పెండ్లి చెయ్యక ఇంటర్మీడియట్ వఱకూ చదివినవెనుక, ఆమె కోరికపై మోహనున కిచ్చి మహావైభవముతో పెండ్లి చేసిరి.

మధుసూదనరావుగారు వ్యాసరచయితలు; బాగాచదివినవారు. ఆయన కూర్చోని ఏమో వ్రాసుకొనుచుండగా మోటారు నిలచినశబ్దము విని బయటకువచ్చి స్పృహతప్పివున్నకూతును చేతులలో వేసుకు లోనికి తీసుకువెళ్లిరి. ఉపచర్యలు చేయగా కొంతతడవుకు ఆమెమేల్కొంచి ఎక్కువగావగవ నారంభించెను.

తలితండ్రులు ఓదార్చుచు, మెల్లిగా అల్లుడు భార్యప్రవర్తనయం దనుమానపడి ఇట్లు పంపెనని తెలుసుకొని, తా నంతయు చక్కజేసెదనని, ఏమియు భయపడనవసరము లేదని కూతురును తండ్రి ఓదార్చి ధైర్యము చెప్పెను.

ఒకప్రక్క కూతునోదార్చుచున్నప్పటికీ మధుసూదనరావుకు అల్లునిపై అపరిమితమైన ఆగ్రహము కలిగెను. అల్లునిచూచి బాగా చీవాట్లుపెట్టవలెనని అతనిఇంటికి పోగా ఇల్లు తాళమువేసివుండెను. వియ్యంకునితోనైనా చెప్పి చీవాట్లుపెట్టించవలెనని పోగా ఆయన పెడమొగముపెట్టుకు ఆహ్వానమే చేయలేదు. కాని మధుసూదనరావు చాలాశాంత స్వభావము గలవాడు. మంచి నిదానము. కుశలప్రశ్న వేసి మోహను డెక్కడున్నాడని ప్రశ్నించెను.

నరసింహారావు:— మీపుణ్యమా అని నాకొడుకుకు పిచ్చియెత్తించినారు. చెప్పకనే ఎక్కడకో లేచిపోయినాడు. గుడిసేటిపెండ్లాముతో వున్న ముప్పకాక ఇంకేమీ? మొదటనుంచీ నేను చదువుకున్న పిల్ల వద్దు, వాళ్ల నడత తిన్నగా వుండ దనిచెప్పతోనే వున్నాను. కాని అప్పుడు నామాటలు నచ్చలేదు.

మధు:— ఆర్యా, మీరాట్టే సంద చేయక మాపిల్ల ఏమితప్పుడునడత నడచినది కొంత తెలుపప్రార్థన— తప్పున్న నేనే శిక్షించెద.

నర:— తప్పు కేమి ? సానితనముకన్నానా ? మొన్న మావాడు వూరలేనప్పుడు ఎవడో వచ్చి రెండునాళ్లు మేడమీాద మకాం వేశాడట. అది చుట్టుపక్కలవాళ్లంతా చూచి నాతో చెప్పిరి. ఇంతకంటె అనర్థం కావాలే!

మ:— ఒకపురుషుడు వచ్చి ఇంట బస చెయ్యగానే రంకుతనమా! అతనిస్నేహితులెవరైనా వచ్చినారేమో, సంగతిసందర్భాలు సరిగా కనుక్కొని పంచాయితి పెట్టి తప్పొఒప్పొ నిర్ణయించవలెను.

నర:— చాలుచాలు, ఈఅవమానానికి తోడు పంచాయితీకూడానా! తమరు నాతో నీప్రసంగంమాని దయచెయ్యవలసినదని కోరుచున్నాను.

మ:— మీరుపెద్దలు. పిన్నవాండ్రలో తప్పులున్న చీవాట్లుపెట్టి సంసారాలు పొత్తు చేయించవలెను. ఇంతకూ మాపిల్ల నిరపరాధని నేను చెప్పగలను.

నర:— ఆ, ఆలాగె. కొంపలు తీసే కొరివి. మావాడికి ఇంకొకపెండ్లైనా చేసెదనుకాని మీపిల్లతోమాత్రము సంసారము పొసగదు.

మ:— మాబిడ్డ మాఇంటనే వుండుట మా కేమీ భారము కాదు. సత్యశీల; నిరపరాధిని. అట్టిదానిపై ఇట్టిఘోరనింద మోపి కాపురానికి నీళ్లువదలించుటమాత్రము పాపమని చెప్పచున్నానని చెప్పి, లేచి ఇంటికి వచ్చెను.

౪

మాలతి తండ్రివద్దనుంచి సంగతంతా విని విధిని నిందించుచూ మహాదుఃఖములో మునిగిపోయెను. ఒకప్రక్క భర్తృవియోగము, మరొకప్రక్క అకారణమైన నింద వచ్చి తలపైబడినది. ఈబాధలచే అన్నము మాని కృశించిపోవుచుండెను— ఎన్నటికైనా తాను నిర్దోషియని గ్రహించి తనమోహనుడు తన కండ్లబడునా యని వాపోవుచుండె. అప్పటి కామె మూడునెలలు గర్భిణి. తల్లి ఎన్నో విధముల ఓదార్చి ఆహారము నివ్వ ఆమె దానిని ముట్టదు. ఒకనాడు పోష్టువా డొక ఉత్తరమునిచ్చె. అది మోహనుని, దస్తూరీతో ఉండ అతిఆత్రముగా విప్పి చదువగా తాను తిరిగి వివాహము చేసుకొనుచున్నానని ఇంక తమకు పొత్తుకుదురునన్నది వట్టిభ్రమ అని

వ్రాసెను. అది చదివి ఆమె అట్లే మొదలు నరికిన చెట్టువలె నేలగూలె. ఇంతవఱకు కొంతైనా ఆశవుండెడిది. అదికూడ విచ్ఛిన్నమైనదే అని హృదయము పగులునట్లు ఏడ్చిఏడ్చి, ఆరాత్రి భోజనములేకనే పరుండెను.

రాత్రి పండ్రెండుగంటలలో ఎవరో మూలిగినట్లు వినపడగా, మధుసూదనరావుగారు మేల్కొని కూతురుగదికి పోయిచూచిరి. అచట మాలతి స్మృహతప్పి నేలపై పడివుండె. రెండుభుజములనుండి రక్తము ధారగా నేలపై కారుచుండె. తండ్రి భయకంపితుడై గడగడ వణకు కాళ్లతో తొట్రుపాటుతో భార్యను లేపి డాక్టరును రప్పించెను. ఏమున్నది? మాలతి ఈలోకము వదలి పరలోకములో వున్నది. ప్రక్కలో కత్తికూడ అట్లే పడివున్నది. ఒకచీటీకూడ ప్రక్కనే వున్నది. అందు,

"నాజీవితము దౌర్భాగ్యజీవితము. నాకు జీవించుటకు అర్హత లేదు. నామోహానుని ప్రేమయే నాకు లేనపుడు నాకీప్రాణము లేల? నాయం దెట్టినిందయు లేదని భగవంతునిఎదుట ప్రమాణము చేయుచున్నాను. కాని ఒకపురుషుడు వచ్చి నాఇంట బసచేసినది వాస్తవము. నేను నిష్కళంకను. ఆపురుషుడు లీలయొక్క భర్త. నామామకు తెలియకుండ వారిద్దరూ నావద్ద బసచేసి రాత్రిళ్లలో తిరుగుచుండెడివారు. అది ఇరుగు పొరుగువారు చూచి నేనని భ్రమించివుండవచ్చు. పుణ్యమునకుబోవ పాప మెదురయ్యె నాకు. నా భర్త కొంతసావధనముతో నన్నడిగిన స్పష్టపరిచివుండెడిదానను. ఇది నాఖర్మము. నాతలితండ్రులకు ఏకపుత్రినై ఇట్లు వారిని దుఃఖసాగరమున ముంచుచున్నందులకుమాత్రము విచారము. ఇకమీదనైనా పురుషులు స్త్రీలతో మాట్లాడిన తప్పనేభావము పోయి, విశాలమైనదృష్టితో చూచెదరుగాక! పరస్త్రీలు పరపురుషులతో మాట్లాడిననే పవిత్రత పోవునా? నాసోదరీమణులకైన నా ఖర్మము పట్టకుండుగాక!"

తలితండ్రు రాలేఖను చదివి వాపోయి కూతురికి దహనక్రియలు సల్పిరి.

౫

కొన్నిదినములైన వెనుక, ఒకనాటిమధ్యాహ్నము మధుసూదనరావుగారివాకిలి ఎవరో తట్టిరి. తలుపు తెఱువగానె మోహానుడు చిక్కి శల్యమైనల్లబడి, పిచ్చివానివలె వచ్చి మామగారి చేతులుపట్టుకుని "నామాలతి ఎక్కడ. నే నిన్నిదినము లామెను నిష్కారణముగా కష్టపెట్టితిని. నేను మహాపరాధిని. ఆమె క్షమార్పణ కోరుకొనుటకై వస్తిని." అని వలవల ఏడ్వదొడంగె.

మ:—నీవు తిరిగి వివాహముచేసుకొనెదనని వ్రాస్తివిగదా?

మో:—నే నెవ్వరికి ఏమీ వ్రాయలేదు. హిమాలయపర్వతాలలో పడి తిరుగుచున్నాను. ఆసంగతి నాకేమీ తెలియదు.

మ:—బహుశః నీతండ్రి వ్రాసివుండవచ్చు.

మో:—నాతండ్రి! అతను హంతకుడు. నా కాతనిమాట చెప్పవద్దు. నామాలతిని పిలువుడు—ఆమెకాళ్లపై బడి బ్రతిమాలుకొన్న గాని నాకుమనస్సు కుదుటబడదు.

మధుసూదనరావు పొంగి పొంగి వచ్చు దుఃఖము నాపుకొని మాలతివద్దకు తీసుకువెళ్లెద నని తిన్నగా శ్మశానభూమికి పిల్చుకుపోయి మాలతిని దహనము చేసినచోటు చూపి తాను వెడలిపోయెను. మోహను డక్కడ క్రింద పడి దొర్లి దొర్లి ఏడ్చుచూ, చీకటిపడునంతవఱకూ అచటనే వుండెను.

మరునాటి ఉదయము మోహనునిశవము ఆచోటులో పడివుండెను. ఊరంతయు మోహనుడు ఆత్మహత్య చేసుకొనెనని గగ్గోలైనది.



" తిన్నగా శ్మశానభూమికి......దహనముచేసినచోటు చూపి "